# 'సూపర్ పవర్స్'

- ఎ.ఆర్.స్వామి

అత్తా కోడళ్ళ విభేదాలతో, మామా కోడళ్ళ మధ్య మనస్పర్థలతో విసిగి వేసారి, వేగలేక ఇటు భార్యకీ, అటు తల్లిదండ్రులకీ సర్ది చెప్పలేక అడకత్తెరలో పోక చెక్కలాగ నలుగుతున్న రామం ప్రాణం విసిగి కాస్త మనశ్శాంతికి ఆరు బయట చల్లగాలి పీల్చుకోడానికి దగ్గరే ఉన్న సముద్రపు ఒడ్డుకి బయలు దేరాడు.

సంధ్యాసమయం, సూర్యుడు అస్తమిస్తూ, జీవితమంటే చీకటి వెలుగుల సంగమం అన్న నిజాన్ని లోకానికి తెలియజేయడానికి, చీకటి పడడానికి అవకాశమిస్తున్నట్లుగా ఉంది. ఇసుక తిన్నెల మీద కూర్చుని దూరంగా వరుసక్రమంలో ఉన్న ఓడలని, వాటిలో మిణుకు మిణుకు మంటూ వెలిగే దీపాలని గమనిస్తున్నాడు రామం. సముద్రపుటలలు ఒడ్డు చేరాక సడిసేయకుండా ప్రశాంతంగా లోపలికి జాలువారి తిరిగి సముద్రంలో కలిసి ఒక్కసారిగా పెద్ద ఎత్తున రివ్వుమని లేచి హోరుమనే శబ్దంతో తిరిగి ఒడ్డుని తాకుతున్నాయి. ఏదో ప్రశాంతత కావాలని, మనస్సుని స్థిమిత పరచుకోడానికి సముద్రపు ఒడ్డుకి వచ్చినా అక్కడ కూడా రామం మనస్సు సముద్రపు హోరులాగే అల్లకల్లోలంగా ఉంది.

ఈపాటికి ఇంటి దగ్గర అత్తాకోడళ్ళ మనస్పర్థలు కొంత తగ్గి వాతావరణం కొంత చల్లబడి ఉంటుందని ఊహిస్తూ మెల్లగా ఇంటికి బయలుదేరాడు రామం.

అసలు ఈ అత్తా కోడళ్ళ మధ్య గొడవలకి మూలకారణం ఎవరు ? అత్త గొప్పా లేక కోడలు గొప్పా? లేక అహంభావమా ? ఆర్థిక పరమైన కారణాలా ? రామానికి ఈ విభేదాల సమస్యని ఎలా పరిష్కరించాలో తోచటం లేదు.

రామం ఒక మధ్యతరగతి కుటుంబీకుడు. తండ్రి శివయ్య ఆరోగ్యం బాగోని కారణంగా ప్రభుత్వోద్యోగం నుండి విరమించుకొన్న తరువాత ఆ ఉద్యోగావకాశాన్ని రామానికిచ్చింది ప్రభుత్వం. అందరు తల్లిదండ్రులలాగే, కొడుక్కి ఒక సంపాదనంటూ ఏర్పడింది కదా అని, రామం తల్లిదండ్రులు అతనికి ఒక పిల్లనుచూసి వివాహం చేశారు. వివాహమయిన అయిదు సంవత్సరాలకల్లా ఇద్దరు పిల్లల తండ్రి కూడా అయ్యాడు రామం. తల్లి కాంతమ్మకు రామంపైన వల్లమాలిన ప్రేమ. ఒక్కడే కొడుకు కావడం వలన కాంతమ్మ అనుక్షణం రామాన్ని కంటికి రెప్పలా చూసుకుంటూ అతి గారాబంగా పెంచుతూ వచ్చింది. రామం కంటే ముందు కాంతమ్మకి అయిదుగురు పిల్లలు పుట్టిపోయారు. బ్రతికి బట్టకట్టిన వాడు రామం ఒక్కడే. అందుకే ఆమెకు రామం అంటే ప్రాణంకన్నా మిన్న.

రామం పెళ్ళాయ్యాక కూడా ఆమె ప్రవర్తనలో మార్పురాలేదు. ఆవిడ ప్రేమాభిమానాలను అలాగే కొనసాగిస్తోంది. ఈ ప్రవర్తన రామం భార్య రమకు కొంత ఇబ్బందికరంగా తయారయ్యింది. భర్తకు సంబంధించిన ప్రతి చిన్న విషయంలో కాంతమ్మ జోక్యాన్ని సహించలేకపోతోంది. అత్తాకోడళ్ళ మధ్య చిన్న చిన్న విభేదాలున్నప్పటకీ ఉమ్మడి సంసారం కొద్ది రోజులు సజావుగానే సాగింది. రాను రానూ అత్తాకోడళ్ళ మధ్య విభేదాలు పెరుగుతూ వచ్చాయి. చివరికి నువ్వా ? నేనా? అనే స్థాయికి వచ్చారు రమా, కాంతమ్మా. ఒక్కక్షణం కూడా ఇద్దరికీ పడకుండా ఉన్నది.

తల్లిదండ్రులకు ఒక్కగాని ఒక్క కొడుకు కావడం మూలాన కొడుకుని అతిగా ప్రేమించడం, కొడుక్కి కావలసినవన్నీ స్వయంగా చూసుకోవడం, "నాన్నా! పెరుగువేసుకో. నీళ్ళమజ్జిగ వద్దు నీరసం వస్తుంది."

ఉదయాన్నే సైకిల్ మీద ఆఫీసుకు పోయి సాయంత్రం వస్తావు. ఆకలితో ఉండకు. మధ్యాహ్నం కాంటీన్‌లో ఏదో ఒకటి తింటూఉండు. నీ సంపాదనే కదా !' నవమాసాలు మోసి, కని పెంచిన తల్లికి ఈ మాత్రం ఆరాటం సహజమే అనిపిస్తుంది.

డబ్బుతో చాలా పనులవుతాయి. కనుకనే డబ్బును అపసవ్యంగా ఖర్చు చేయరాదు

సహధర్మ చారిణిగా, భార్యగా ఆమాత్రం ప్రేమాభిమానాలు భార్యకు మాత్రం ఉండవా ? ఆమె మాత్రం భర్తని, పిల్లల్ని పస్తులుండమంటుందా ? ఏదో సంపాదించిన దాంట్లో కొంత తన సంసారానికని వెనకేసుకోవడంలో తప్పేమిటి ? తన ఇద్దరు పిల్లల భవిష్యత్తు గూర్చి ఆలోచిస్తూ కొంత పొందిగ్గా సంసారం చేసుకుంటే తప్పా ? రేషన్ బియ్యంతో సరిపెట్టుకోలేమా ? కిలో పద్దెనిమిది రూపాయల రకం బియ్యమే ఉండాలా ? అత్తమామలు వేరే ఉంటే తెలుస్తుంది. అనుక్షణం మనస్పర్ధలతో బతికే కన్నా వేరు వేరుగా ఉండటమేనయం. ఏదో నెలకింతని పడేయ వచ్చు, ఇది కోడలి అభిప్రాయం. ఇదీ సహజమే అనిపిస్తుంది.

ఇలా చిన్న చిన్న విషయాలమీద అభిప్రాయ భేదాలు వచ్చి చిలికి చిలికి గాలివానై చివరికి వేరు కుంపట్లే నయం అనే పరిస్థితికి వచ్చారు. రోజూ ప్రతిచిన్న విషయానికి తగవులు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ విషమ పరిస్థితినుండి బయటపడటానికి రామానికి మరోమార్గం తోచలేదు. ఒక గట్టినిర్ణయానికి వచ్చాడు. వేరు వేరు సంసారాలే శరణ్యం. ఇద్దరు 'సూపర్ పవర్స్' ని విడదీయాలి, తప్పదు. ఇదే పరిష్కారం. ఇదే సరైన మార్గం.

కానీ వేరే సంసారం పెట్టినంత మాత్రాన సమస్య సమసిపోతుందా ? తల్లిదండ్రులు తనకి దూరంగా ఉంటే ఆదరాభిమానాలు పొందగలుగుతాడా ? వారి పట్ల తన బాధ్యతను నిర్వర్తించగలుగుతాడా ? అటు భార్య విషయానికి వస్తే ఆమె అభిప్రాయాలు, ఆలోచనా విధానం కూడా అతనికి తప్పుగా అనిపించడం లేదు. మధ్య తరగతి కుటుంబాలలో అంతంత మాత్రంగా ఉంటున్న ఆర్థిక వనరులతో తన సంసారమే భారంగా ఉన్నప్పుడు తల్లిదండ్రుల భారాన్ని కూడా మోయడం రామానికి కష్టంగానే తోచింది. కానీ ఆర్థిక సమస్యలే కారణంగా తల్లిదండ్రులను దూరం చేసుకోవాలా ? తండ్రి ఉద్యోగం విరమించుకుని తనకి ఉద్యోగం వేయించాక తల్లిదండ్రులను ప్రక్కకు నెట్టి తనస్వార్థం తాను చూసుకుంటే, తల్లిదండ్రులు ఏమనుకుంటారు ? సమాజం తన చర్యని హర్షిస్తుందా ? భార్య మాటలకి బానిసయ్యాడు అని ఆడిపోసు కోదూ ? తల్లి దండ్రులను ఆదరించడానికీ, భార్యా బిడ్డల్ని ప్రేమించడానికి మధ్య ఈ అభిప్రాయ భేదాలేమిటి, ఈ అవరోధాలేమిటి ? అసలు వీరిద్దరిలో ఎవరిమాట వినాలి? ఎవరికి ప్రాముఖ్యం ఇవ్వాలి ? ఒకప్రక్క నవమాసాలు మోసి కనిపెంచిన తల్లి, మరోప్రక్క ఏడడుగులు నడచిన సహధర్మచారిణి. ఏది ఏమైనా తల్లిదండ్రుల చేత వేరే సంసారం పెట్టించడానికి నిర్ణయించుకుని ఇల్లు చేరాడు రామం.

• • • • • • • • • • • • • • • •

'రామం ! ఒకసారి ఇలా రా నాయనా' ఆప్యాయంగా పిలిచింది కాంతమ్మ. ఒక గ్లాసుతో మంచినీళ్ళు రామం చేతికిస్తూ 'ఒరే నాన్నా ! గత కొద్ది రోజులుగా ఏదో ఆవేదన చెందుతున్నావు. ఏవో ఆర్థిక పరమైన ఇబ్బందులలో ఉన్నట్లున్నావు. ఈ బంగారం గాజులు రెండూ తీసుకుని అమ్మి ఆ వచ్చిన డబ్బులతో నీ సమస్యలు తీర్చుకో. ఇవి నా పెళ్ళికి మా పుట్టింటి వాళ్ళు పెట్టినవి. నీ చదువుకీ, ఉద్యోగ ప్రయత్నాలకీ కొంత బంగారం ఎలాగూ అమ్మేశాను. ప్రస్తుతానికి నా దగ్గర మిగిలినవి ఇవే. ఇవి అమ్మగా వచ్చిన సొమ్ముతో నీ కష్టాలు కొంత తీరితే అదే నాకు పదివేలు. డబ్బు, ఈ బంగారం వస్తువుల కంటే ఈ మమతానురాగాలే శాశ్వతం రా నాయనా! చివరిగా మరో విషయం. రాత్రి మీనాన్న,నేను ఒక నిర్ణయానికి వచ్చాము. మేము ఈ నగరాన్ని వదలి మన వూరికి పోయి అక్కడ ఉన్న చిన్న పెంకుటింట్లో మా కొచ్చే కొద్దిపాటి పెన్షన్‌తో ఏదోలా బతుకుదామనుకుంటున్నాము

రేపే గ్రామం వెళ్లి పోదామనుకుంటున్నామ' ని చమర్చిన కళ్ళతో కొడుక్కి తన అభిప్రాయాన్ని వెలిబుచ్చింది కాంతమ్మ.

• • • • • • • • • • • • • • • • •

రమ తన చిన్న కొడుకుని బుజ్జగిస్తూ గోరు ముద్దలు తినిపిస్తోంది. వాడు మారాము చేస్తున్నాడు. వాడికి ఏదోలా రెండు పెరుగు అన్నం ముద్దలు తినిపించాలని హైరానా పడుతోంది రమ. ఎలాగో రెండు ముద్దలు తినిపించి వాడిని భుజంమీద వేసుకుని జోలపాట పాడుతూ నిద్రపుచ్చుతోంది. ఆ దృశ్యాన్ని వాలుకుర్చీలో కూర్చుని గమనిస్తున్న రామానికి అనిపించింది 'తల్లిప్రేమ ఎంత గొప్పది' ...